క్లుప్తంగా

పేకాడుతున్న నలుగురి అరెస్టు

చోడవరం రూరల్: లక్ష్మీపురం పెద్ద చెరువు గట్టు శివారు ప్రాంతంలో పేకాడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ బి.అప్పలనాయుడు గురువారం తెలిపారు. బుధవారం సాయంత్రం పేకాట శిబిరంపై దాడి చేశామన్నారు. ఆ సమయంలో వీరిని అదుపులోకి తీసుకుని, రూ.3,800తోపాటు పేక దస్తాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

సంక్షేమ పథకాలు అర్హులకందేలా కృషి

ఎంపీపీ మణికుమారి

గొలుగొండ: సంక్షేమ పథకాలు అర్హులకందేలా నాయకులు, అధికారులు పని చేయాలని ఎంపీపీ గజ్జెలపు మణికుమారి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజా సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సంక్షేమ పథకాలన్నీ గ్రామాల్లో పూర్తి స్థాయిలో ప్రజలకు అందేలా నాయకులు పని చేయాలని కోరారు. 36 గ్రామాల్లో శత శాతం కుళాయిల మంజూరుకు రూ.64 లక్షలు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామని ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుభాషిణి తెలిపారు. వైస్ ఎంపీపీలు ఎస్.బాబ్జీ, జె.నాగమణి, ఎంపీడీవో డేవిడ్‌రాజు, తహసీల్దార్ ఆనందరావు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కనీస వేతనం అందించాలని వినతి



డీటీ రమేష్‌కు వినతి అందిస్తున్న కార్యకర్తలు

కె.కోటపాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేస్తున్న సిబ్బందికి కనీస వేతనం రూ.25 వేలు అందించాలని అంగన్‌వాడీ వర్కర్ల అండ్ హెల్పర్ల యూనియన్ నాయకురాలు జి.కుమారి కోరారు. అంగన్‌వాడీ సిబ్బంది సమస్యల పరిష్కారానికి గురువారం ఆమె డిప్యూటీ తహసీల్దార్ రమేష్‌కు వినతిపత్రం అందించారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు ఫేస్ యాప్ రద్దు చేయాలని తెలిపారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలను పెంచాలని కోరారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

మాడుగుల: విశాఖ ఎల్.వి ప్రసాద్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌సీఎం వృద్ధాశ్రమంలో గురువారం నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 72 మందికి కంటి పరీక్షలు చేసి, ఆరుగురిని శస్త్ర చికిత్సలకు, 14 మందిని కళ్లద్దాలకు ఎంపిక చేశారు. నేత్ర వైద్యులు సూర్యకుమారి, సిస్టర్లు అనిత, మేరీ, ఏంజెల్, ఫ్రానిషస్, ఫీల్డ్ వర్కరు సంతోషి పాల్గొన్నారు.

వలంటీరుకు నియామక పత్రం అందజేత



నియామక పత్రం అందిస్తున్న ఎంపీపీ, ఎంపీడీవో

చీడికాడ: జైతవరంలో నూతనంగా ఎంపికైన వలంటీరుకు ఎంపీపీ కురచా జయమ్మనారాయణమూర్తి, ఎంపీడీవో జయప్రకాష్ నియామక పత్రం అందించారు. గ్రామానికి చెందిన ఒక వలంటీరు ఉపాధి రీత్యా రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో బొబ్బిలి గంగరాజు ఎంపికయ్యారు. జైతవరం ఉప సర్పంచ్ ఈర్లె చైతన్య, మోడల్ స్కూల్ పీఎంసీ చైర్మన్ కురచా రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నేత పుట్టా రాంకుమార్, పంచాయతీ కార్యదర్శులు గోపి, రాజేందర్ పాల్గొన్నారు.

నేవీ నిర్వాసితుల ధర్నా

రాంబిల్లి : నేవీ నిర్వాసితుల ధర్నా కొనసాగుతుంది. గురువారం నాటికి ధర్నా 74వ రోజుకు చేరింది. న్యాయబద్ధమైన తమ డిమాండ్లను సత్వరమే పరిష్కరించాలంటూ నేవీ నిర్వాసితులు నినాదాలు చేసారు. వాడనర్సాపురం, కొత్తపట్నం, కొప్పుగొండుపాలెం, గోవిందపాలెం, కొత్తపేట తదితర గ్రామాల ప్రజలు ధర్నాలో పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి స్వామి వివేకానంద



సామి వివేకానంద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయ అధికారి దమయంతి



రోలుగుంట: జూనియర్ కళాశాలలో వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న సంఘ సభ్యులు



కె.కోటపాడు: గొండుపాలెంలో వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న యువకులు

నర్సీపట్నం: స్థానిక శాఖా గ్రంథాలయంలో స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలవేసి గ్రంథాలయ అధికారిణి పి. దమయంతి నివాళులర్పించారు. జెడ్పీ హైస్కూల్(మెయిన్) విద్యార్థులు నాటక రూపంలో స్వామి వివేకానంద జీవిత చరిత్రను వివరిస్తూ ప్రదర్శించారు. స్వామి వివేకానంద, దేశ నాయకుల వేషధారణలో విద్యార్థులు అలరించారు. ఇన్‌చార్జి లైబ్రేరియన్ రాజుబాబు, ఉపాధ్యాయులు నారాయణరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కె.కోటపాడు: యువత సేవా మార్గంలో పయనించడాన్ని బాధ్యతగా గుర్తించాలని రిటైర్డ్ ఉపాధ్యాయుడు బి.వి.రమణమూర్తి తెలిపారు. సమాజ మిత్రమండలి ఆధ్వర్యంలో గురువారం గొండుపాలెంలో వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండలంలో హైస్కూళ్ల విద్యార్థులకు వివేకానందపై వ్యాసరచన పోటీలు నిర్వహించి ఎస్‌ఐ ధనుంజయ్ బహుమతులను అందించారు. దండెంనాయుడు, మల్లాది కామేశ్వరరావు, హెచ్‌ఎం ఆర్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రోలుగుంట: యువతకు స్ఫూర్తి స్వామి వివేకానంద అని స్వామి వివేకానంద యువజన సంఘం ప్రతినిధి అల్లు మోహన్, మడ్డు జశ్వంత్ తెలిపారు. స్థానిక జూనియర్ కళాశాల వద్ద గురువారం స్వామి వివేకానంద జయంత్యుత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘ సభ్యులు పాల్గొన్నారు. కళాశాల అధ్యాపకులు, కొవ్వూరు సచివాలయ ఉద్యోగి బండారు కిరణి శ్రద్ధాంజలి ఘటించారు.

కాలినడకన సింహాద్రప్పన్న భక్తుల పయనం



ఇరుముడులతో భజన చేస్తున్న సింహాద్రప్పన్న మాలధారణ భక్తులు

మాడుగుల రూరల్: కె.జె.పురంలో సింహాద్రప్పన్న మాలధారణ స్వాములు గురువారం సాయంత్రం ఇరుముడులు ధరించి కాలినడకన సింహాచలం బయలు దేరారు. ధనుర్మాసం సందర్భంగా గత నెల 16న మాలధారణ వేసిన వీరంతా భజనలు చేస్తూ ఇరుముడులతో బయలు దేరారు. వీరిలో స్వామి దాసుడు వేగి హరికృష్ణతోపాటు మరో 30 మంది స్వాములు, మరో 20 మంది సాధారణ భక్తులు ఉన్నారు. స్వామివారి ఆలయానికి శుక్రవారం ఉదయం చేరుకుంటారు. పదేళ్లుగా కాలినడకన వెళ్తున్నామని దాసుడు హరికృష్ణ తెలిపారు.

పొంగలిపాకలో 170 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి ప్రసాద్‌పాత్రుడు

మాడుగుల: పొలంగలిపాకలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగుల ఇళ్లకు వెళ్లి వైద్య సేవలందించారు. 170 మందికి బీపీ, సుగర్ జ్వరాలకు రక్త పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. సర్పంచ్ నాయన దేముడమ్మ, వైద్యాధికారి ప్రసాద్ పాత్రుడు, 104 వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఇళ్లకు విద్యుత్ సరఫరా



విద్యుత్ సరఫరాను ప్రారంభిస్తున్న సర్పంచ్

మాకవరపాలెం: జగనన్న కాలనీలో పూర్తయిన ఇళ్లకు విద్యుత్ సౌకర్యం కల్పించారు. బయ్యవరంలో 34 మందికి ప్రభుత్వం స్థలాలను పంపిణీ చేసి ఇళ్లను నిర్మించుకునేందుకు నిధులు మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో ఇప్పటికే తొమ్మిది మంది గృహ ప్రవేశాలు చేశారు. వీరి ఇళ్లకు విద్యుత్ శాఖ ఉచితంగా మీటర్లను అందజేసి ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద స్విచ్చాన్ చేసి సరఫరాను సర్పంచ్ లాలం కాశీవిశ్వనాథ్ గురువారం ప్రారంభించారు. మీటర్లతోపాటు స్తంభం నుంచి ఇంటి వరకు అవసరమైన వైరు, సామగ్రిని ప్రభుత్వమే ఉచితంగా అందించడం ఎంతో ఆనందించదగ్గ విషయమన్నారు. విద్యుత్ శాఖ ఏఈ బాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

కందిపూడిలో సమస్యలన్నీ పరిష్కరిస్తా

గడప గడపకు కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



కందిపూడిలో ప్రజా సమస్యలు వింటున్న విప్ ధర్మశ్రీ



పాత కందిపూడిలో తిరిగి ప్రజా సమస్యలు గుర్తిస్తున్న విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: ప్రజలకు అవసరమైన పనులన్నీ చేపట్టి కందిపూడిలో సమస్యలు లేకుండా చేస్తానని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. గురువారం కొత్త, పాత కందిపూడి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ రెండు గ్రామాల్లో ఆయన ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సంక్రమంగా అందుతున్నాయా లేదా అని ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వం కన్నా ప్రస్తుతం సంక్షేమ పథకాలు బాగానే అందుతున్నాయని, అవినీతికి తావులేకుండా నేరుగా తమ బ్యాంకు ఖాతాలో నగదు జమవుతుందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. వలంటీరు, సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో మండల కేంద్రాల చుట్టూ తిరగకుండా గ్రామంలోనే పనులన్నీ పరిష్కారమవుతున్నాయని చెప్పారు. రెండు గ్రామాల్లో సమస్యలను ప్రభుత్వ విప్ ధర్మశ్రీ దృష్టికి తీసుకొచ్చారు. పెద కందిపూడి మెయిన్ రోడ్డులో డ్రైనేజీ, కొత్త కందిపూడిలో రామకోవెల వరకు డ్రైనేజీ ఏర్పాటు చేస్తామని, భూలోకమాంబ, పైడిమాంబ ఆలయాల వద్ద మండపాలు నిర్మాణం, పెద కందిపూడి స్కూల్ నుంచి జన్నవరం హైస్కూల్ వరకు రోడ్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, తహసీల్దార్ అంబేడ్కర్, ఎంపీడీవో సువర్ణరాజు, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, సర్పంచ్ కొప్పాక సత్యవతి, పార్టీ అధ్యక్షుడు, కన్వీనర్ కొప్పాక గణేష్, మాజీ సర్పంచ్ కనకయ్య, నాయకులు ఎల్లపు విజయ్‌కుమార్, జోగా కొండబాబు, వెంకటరావు, నైదాన రాజు, శ్రీను పాల్గొన్నారు.

ఏ.కొత్తపల్లిలో గడప గడపకు నేడు

దేవరాపల్లి: ఏ.కొత్తపల్లిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు నిర్వహిస్తారని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి ప్రతీ ఇంటికి వెళ్లి సంక్షేమ లబ్ధితోపాటు ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటారన్నారు. ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జెడ్పీటీసీ కర్రి సత్యం పాల్గొంటారన్నారు.

సభ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలకు పరిష్కారం

ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు

రోలుగుంట: సభ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలపై సామరస్యంగా స్పందించి పరిష్కరించాలని ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. తన అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఇక్కడ శాఖల వారీగా వైద్యులు విమలగిరి, సునీత, తహసీల్దార్ వెంకటేశ్వర్రావు, ఎంపీడీవో ప్రభాకర్రావు, వెలుగు ఏపీఎం సాధన, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో సూర్యామణి, హౌసింగ్ ఏఈ ప్రేమానందం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజు తదితర అధికారులు వారి శాఖల ప్రగతి గురించి వివరించారు. ఈ క్రమంలో ప్రగతి గురించి గొప్పలు కాదు, తమ గ్రామాల్లో తాగునీటి సమస్య తీర్చాలని కుసుర్లపూడి సర్పంచ్ మడ్డు అప్పలనాయుడు, కొమరలోవ ఎంపీటీసీ గొర్లె రామన్ నిలదీశారు. జగన్ లేఅవుట్ల ఏర్పాటు పనులు పూర్తయినా బిల్లుల కాలేదని సర్పంచ్ అప్పలనాయుడు, జెనాయుడుపాలెం సర్పంచ్ బగుడు వెంకటరమణ, కంచుగుమల్లో దేవదాయ భూములకు చెందిన భూసర్వే నంబర్లు తప్పుగా నమోదైనందున బాధిత రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని సర్పంచ్ బండారు శ్రీనివాసరావు, ఎన్‌ఆర్‌ఈజీఎస్, హౌసింగ్‌లో అభివృద్ధి పనుల బిల్లులు వెంటనే మంజూరు చేయాలని, వెలుగు శాఖలో రుణాలు జమలపై తలెత్తుతున్న సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఎంపీపీ స్పందిస్తూ వెంటనే సభ దృష్టికి వచ్చిన సమస్యలపై స్పందించాలని అధికారులకు సూచించారు. జెడ్పీటీసీ పోతల లక్ష్మీ రమణమ్మ, వైస్ ఎంపీపీ కొల్లు సన్యాశినాయుడు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార సంక్షేమానికి సీఎం చేయూత



మోపెడ్ వాహనాలు పొందిన మత్స్యకారులతో గ్రామ పెద్దలు

కె.కోటపాడు: మత్స్యకార కుటుంబాల సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిస్తున్నారని ఎ.కోడూరు ఎంపీటీసీ లెక్కల గౌతమి అన్నారు. ఇటీవల గ్రామానికి చెందిన ఆరుగురు మత్స్యకారులకు పీఎం మత్స్య సంపద యోజనలో టీవీఎస్ మోపెడ్ వాహనాలు సబ్సిడీపై మంజూరయ్యాయి. గురువారం వీరితో కలిసి ఎంపీటీసీ గౌతమి మాట్లాడుతూ మత్స్యకారుల అభ్యున్నతికి ప్రభుత్వం సహకారం అందనుందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు లెక్కల శంకరరావు, ఆర్బీకే చైర్మన్ దొగ్గ సత్యం, ఉప సర్పంచ్ దేముళ్లు, దొగ్గ శివ ప్రసాద్, యడ్ల పాపునాయుడు, లెక్కల దేముడు, యడ్ల దేముడు పాల్గొన్నారు.

కోడిపందేలు, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు

డీఎస్పీ ప్రవీణ్‌కుమార్



నర్సీపట్నం: కోడి పందేలు, జూద శిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నర్సీపట్నం డీఎస్పీ ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. పట్టణ పోలీసు స్టేషన్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండగ ముసుగులో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. సంక్రాంతి పండగను అందరూ సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. కోడిపందేలు, గుళ్ల ఆట, పేకాట నిర్వహించడం చట్టరీత్యా నేరమన్నారు. వీటిపై పటిష్టమైన చర్యలు తీసుకోవాలని డివిజన్‌లోని సీఐలు, ఎస్సైలకు ఆదేశాలు ఇచ్చామన్నారు. పండగకు దూర ప్రాంతాలకు వెళ్లేవారు ఇళ్లలో చోరీలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలీసులు సమాచారం ఇస్తే వాటికి భద్రత కల్పిస్తామన్నారు. విలువైన బంగారం, డబ్బు వెంట తీసుకెళ్లాలన్నారు. పండగ నేపథ్యంలో పరిసర ప్రాంతాల నుంచి వచ్చే వారితో నర్సీపట్నంలో రద్దీ పెరిగిందన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేకమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అబిద్‌సెంటర్, శ్రీకన్య, పెదబొడ్డేపల్లి వంటి ముఖ్య కూడళ్లలో ట్రాఫిక్ పర్యవేక్షణకు సిబ్బందిని ఏర్పాటు చేయాలని సీఐకు ఆదేశాలు ఇచ్చామన్నారు. ప్రజలు కూడా పోలీసుకు సహకరించాలన్నారు. పోలీసు హెచ్చరికలను బేఖాతరు చేస్తే ఊరుకునేది లేదన్నారు.

రోలుగుంట: సంక్రాంతి సెలవుల నేపథ్యంలో ఊళ్లకు వెళ్లేవారు తమ గృహాలు భద్రపరచుకోవడంపై జాగ్రత్తలు పాటించాలని ఎస్సై బి.నాగకార్తీక్ తెలిపారు. ఇళ్లలో విలువైన ఆభరణాలను బంధువుల వద్దగాని, బ్యాంకు లాకర్స్‌లోగాని భద్రపరచుకోవాలని సూచించారు. భద్రతా చర్యల్లో భాగంగా 9490619495 సంప్రదించి శాఖాపరమైన సేవలు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ముగిసిన మేలుకొలుపులు



ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న మహిళలు

రావికమతం: మండలంలో నెల రోజులుగా భజన బృందాలు చేపట్టిన మేలుకొలుపు కార్యక్రమాలు గురువారంతో ముగిశాయి. ధనుర్మాసం ప్రారంభం నుంచి రోజూ తెల్లవారుజామున భక్తి పాటలు ఆలపిస్తూ కీర్తనలు చేస్తూ ఇంటింటికి తిరిగారు. ఆ విధంగా మండలంలో పలు గ్రామాల్లో మేలుకొలుపులు చేసిన భజన బృందాలన్నీ గురువారం టి.అర్జాపురంలో ఒక్కటై రాములవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తూ కీర్తనలు ఆలపించాయి.

సందడిగా సంక్రాంతి సంబరాలు



బుచ్చెయ్యపేటలో హరిదాసుకు భిక్ష వేస్తున్న విద్యార్థినులు



హరిదాసు వేషధారణలో చిన్నారి

బుచ్చెయ్యపేట: ముందస్తు సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా నిర్వహించారు. రంగురంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టి భోగి మంటలు వేసి ఆటపాటలతో చిన్నారులు సందడి చేశారు. పలు రకాల పిండి వంటల తయారీ, సంప్రదాయ వస్త్రధారణ, తదితర కార్యక్రమాలు గ్రామీణ వాతావరణం ఉట్టిపడేలా నిర్వహించారు. గురువారం సీతయ్యపేట, వడ్డాది, బుచ్చెయ్యపేట జాజిమొగ్గల, తదితర పాఠశాలల్లో ఈ వేడుకలు జరిగాయి.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పోలీసు గస్తీ



ఆర్టీసీ బస్సుల ప్లాట్‌ఫాం వద్ద పోలీసులు

అనకాపల్లి టౌన్ : పండగల సమయం, ప్రయాణికుల రద్దీ దృష్ట్యా స్థానిక ప్రజా రవాణా శాఖ (ఆర్టీసీ) కాంప్లెక్స్ వద్ద పట్టణ పోలీసులు బుధవారం పహారా కాశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ఆకతాయిల చేష్టలకు చెక్ పెట్టేలా నిఘా పెంచారు. ఒక్కసారిగా బస్సు ఎక్కేందుకు తోపులాటలకు తావులేకుండా సూచనలు, సలహాలు అందిస్తూ క్రమపద్ధతిలో బస్సులోకి చేరేలా చర్యలు చేపట్టారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఎక్స్‌ప్రెస్ డిపో వద్ద ప్రత్యేకంగా పోలీసులను ఆ విభాగం ఏర్పాటు చేసింది.

బైలపూడి, మంచాల గ్రామాల్లో చేతిపంపు పనులు



బోరు తవ్వకానికి భూమి పూజ చేస్తున్న నేతలు

చీడికాడ: డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో బైలపూడి, మంచాల గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారం కానుంది. బైలపూడికి సమీపంలో ముత్యాలమ్మ తల్లి చెట్టు వద్ద, మంచాల సి.డిల వారి కల్లాల వద్ద రెండు చేతిపంపుల ఏర్పాటుకు ఎంపీపీ నిధులు కేటాయించారు. ఈ మేరకు గురువారం ఆయా గ్రామాల వైఎస్సార్‌సీపీ నేతలు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు.

సనాతన హిందూ ధర్మాన్ని అనుసరించాలి



పాములవాకలో మేలుకొలుపులో పాల్గొన్న శ్రీ కృష్ణ చరణానంద భారతి స్వామి

కోటవురట్ల : సనాతన హిందూ ధర్మాన్ని అనుసరించాల్సిన బాధ్యత అందరిపై ఉందని శ్రీ కృష్ణ చరణానంద భారతి మహరాజ్ అన్నారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాములవాకలో మేలుకొలుపు మహా సమ్మేళనం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన స్వామి 35 గ్రామాల నుంచి వచ్చిన మేలుకొలుపు బృందాలతో కలిసి ఎస్సీ కాలనీలోని రామాలయం నుంచి మేలుకొలుపు నిర్వహించారు. పట్టాలమ్మ నవదుర్గల దేవస్థానం వరకు సంకీర్తన చేశారు. స్వామి మాట్లాడుతూ ప్రపంచ దేశాలకు హిందూ ధర్మం గొప్పతనాన్ని చాటిన మహోన్నతుడు స్వామి వివేకానంద అన్నారు. భగవద్గీతను పాఠ్యాంశంగా చేర్చాలన్నారు. భగవద్గీత విశ్వ మానవ జ్ఞాన గ్రంథమన్నారు.

సీతంపాలెంలో క్రికెట్ పోటీలు

నక్కపల్లి : సీతంపాలెంలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలను వైఎస్సార్‌సీపీ నాయకులు శీరం నర్సింహమూర్తి ప్రారంభించారు. మొదటి బహుమతి రూ.10వేలు, రెండో బహుమతి రూ.5వేలుగా నిర్ణయించారు.

గ్రామాల్లో చురుగ్గా పారిశుధ్య పనులు



సాగరం రోడ్డుపై తుప్పలు తొలగిస్తున్న దృశ్యం



జేడీపేటలో డ్రైనేజీల్లో పూడిక తొలగిస్తున్న దృశ్యం

మాడుగుల/మాడుగుల రూరల్: సాగరం ప్రధాన రహదారిపై ఎంపీటీసీ శ్రీనాథు జగ్గారావు, సర్పంచ్ జయమ్మ ఆధ్వర్యంలో గురువారం తుప్పలు తొగించారు. వాహనచోదకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జేడీపేటలో వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజరామ్, సర్పంచ్ కొసిరెడ్డి కృష్ణమూర్తిల ఆధ్వర్యంలో డ్రైనేజీల్లో పూడిక తొలగించారు. ఇక్కడ పది వార్డుల్లో పూడిక తొలగించి ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డుకు తరలించారు. పంచాయతీ కార్యదర్శి వెచ్చా రమేష్, సచివాలయ సిబ్బంది పర్యవేక్షించారు. ఎం. కోడూరులో దోమల నివారణకు స్ప్రేయింగ్ చేపట్టారు. సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు పర్యవేక్షణలో గురువారం ఫాగింగ్ మిషన్‌తో దోమల నివారణ చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి కోరుకొండ జగదీష్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు పాల్గొన్నారు.

మెరుగైన విద్యా బోధనకు చర్యలు



ఎంఈవో సాయిశైలజ

రోలుగుంట: పాఠశాలల్లో మెరుగైన విద్యా బోధన కోసం మెరుగైన చర్యలు తీసుకుంటున్నట్లు ఎంఈవో సాయిశైలజ తెలిపారు. గురువారం తన కార్యాలయంలో విద్యా బోధన అభివృద్ధి చర్యలపై ఆమె మాట్లాడారు. ప్రథమంగా పాఠశాలల్లో ఉదయం పూట విద్యార్థులకు బోధన ఉంటుందన్నారు. మధ్యాహ్నం వారు నేర్చుకున్న అంశాలపై స్నేహ పూర్వకంగా కృత్యాధార బోధన, 6, 7, 8 తరగతుల వారికి అవసరమై బోధన అందిస్తామన్నారు. ప్రధానంగా అన్ని పాఠశాలల్లోనూ స్పోకెన్ ఇంగ్లిష్‌కు ప్రాధాన్యమిస్తామన్నారు.

రేపు గోదాదేవి కల్యాణం

మాడుగుల: స్థానిక పురాతన పార్థసారథి ఆలయంలో ఈ నెల 14న ఉదయం అత్యంత వైభవంగా నిర్వహించే గోదాదేవి కల్యాణ వేడుకకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఆవరణలో శుభ్రం చేశారు. తోరణాలు అమర్చుతున్నారు. చుట్టుపక్కల గ్రామాలతోపాటు మాడుగుల పట్టణంలో 500 మంది భక్తుల వరకు కల్యాణంలో పాల్గొంటారని ఆలయ అర్చకులు అంచనా వేస్తున్నారు. శతాబ్ద కాలంగా మాడుగుల మహరాజుల ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరిగేవని, వారి అనంతరం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆర్థిక సహకారంతో నిర్వహిస్తున్నారని గ్రామపెద్దలు చెబుతున్నారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

సబ్బవరం: మండలంలోని అజనగిరి శివారులో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు సీఐ రంగనాథం తెలిపారు. వారి వద్ద నుండి రూ. 660 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వారిలో షేక్ రెహమాన్ (60), బొడ్డేపల్లి తాతబాబు (47), యర్రా సింహాద్రి (45), ఇందల సత్యారావు (49)పై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు ఆయన తెలిపారు.